సాక్షి
అనంతపురం

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



రేపు 'స్పందన' ఉండదు

విజయదశమి పండుగ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు డీఆర్వో గాయత్రీదేవి తెలిపారు.



అర్ధరాత్రి యువకుడి హత్య

అనంతపురం నగరంలో శుక్రవారం అర్ధరాత్రి యువకుడు హత్యకు గురయ్యాడు. గంటల వ్యవధిలోనే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. IIలో

గరిష్టం/కనిష్టం

37.6°/22.8°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గి ఉక్కపోత పెరిగింది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'ఆరోగ్య సురక్ష'కు స్పందన



కాలువపల్లి ఆరోగ్య శిబిరంలో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, విశ్వ

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. శనివారం జిల్లాలోని 22 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని 9,126 మంది ఓపీ సేవలు వినియోగించుకున్నారు. 44 మంది స్పెషలిస్టు వైద్యులు దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న 193 మందిని జిల్లా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. 1,317 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అనంతపురం రాణినగర్‌లోని ఆశా స్కూల్‌లో జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

ధర్మవరం-మచిలీపట్నం రైళ్ల దారి మళ్లింపు



అనంతపురం సిటీ: ధర్మవరం-మచిలీపట్నం మధ్య తిరిగే రైళ్లను ఆదివారం నుంచి దారి మళ్లించినట్లు అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ శనివారం రాత్రి తెలిపారు. ధర్మవరం నుంచి ఆది, మంగళ, బుధవారాల్లో మచిలీపట్నం బయలుదేరే రైలు(నంబర్: 17216) గుత్తి ఫోర్ట్, తాడిపత్రి, కొండాపురం, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, కోవెలకుంట్ల, బనగానపల్లి మీదుగా కాకుండా ధర్మవరం, అనంతపురం, గుత్తి, పెండేకల్లు, ద్రోణాచలం, నంద్యాల మీదుగా మచిలీపట్నం చేరుకుంటుందని వివరించారు. తిరిగి 23, 24, 25 తేదీల్లో మచిలీపట్నం నుంచి ధర్మవరం బయలుదేరే రైలు (నంబర్: 17215) కూడా కొత్త మార్గంలోనే రానున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా మంగపట్నం - ముద్దనూరు మార్గంలో అత్యవసర పనులు ప్రారంభించిన దృష్ట్యా పైన పేర్కొన్న రైళ్ల రాకపోకలను మార్పు చేసినట్లు పేర్కొన్నారు. అయితే రైళ్ల వేళల్లో మార్పు లేదని స్పష్టం చేశారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించి రాకపోకలు సాగించాల్సిందిగా స్టేషన్ మేనేజర్ కోరారు.

అక్రమాల వరద కొండంతై

- బినామీల పేరిట లీజు
- పరిమితికి మించి క్వారీలో తవ్వకాలు
- అధికారుల తనిఖీల్లో బయటపడ్డ అక్రమాలు
- మాజీ ఎమ్మెల్యే బినామీకి రూ.61 కోట్ల జరిమానా

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రోడ్డు మెటల్ క్వారీలను బినామీల పేరిట లీజుకు పొందారు. అక్రమంగా ఖనిజ రవాణా చేస్తున్న ఆయన ఇన్నేళ్లు అధికారులను భయభ్రాంతులకు గురి చేసి క్వారీల వైపు రాకుండా తన చీకటి వ్యాపారాన్ని సాగించారు. ఇటీవలే గనులశాఖ అధికారులు ఆ మాజీ ఎమ్మెల్యే స్టోన్ క్రషర్ యూనిట్‌ను తనిఖీ చేసి రోడ్డు మెటల్ నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించి రూ.1.60 కోట్ల జరిమానా విధించిన విషయం విదితమే. తాజాగా మాజీ ఎమ్మెల్యే బినామీ పేరిట ఉన్న రోడ్డు మెటల్ క్వారీని గనుల శాఖ అధికారుల బృందం తనిఖీ చేసి.. అక్రమ తవ్వకాలను గుర్తించింది.

అనంతపురం టౌన్: క్వారీల మాటున ధర్మవరం మాజీ ఎమ్మెల్యే సాగిస్తున్న అక్రమ ఖనిజ రవాణా దందాలో కొండలను సైతం పిండి చేసేశారు. ప్రభుత్వానికి పైసా చెల్లించకుండా రోడ్డు మెటల్ తరలించి సొమ్ము చేసుకున్నారు. అనంతపురం రూరల్ మండలం చియ్యేడు పొలం సర్వే నంబర్ 231లో 4.6 హెక్టార్ల రోడ్డు మెటల్ కొండకు ఆ మాజీ ఎమ్మెల్యే బినామీగా పేరున్న కె.సాంబశివుడు లీజు పొందారు. లీజు పొందిన ప్రాంతంలో రోడ్డు మెటల్ తవ్వకాలను చేపట్టి.. మాజీ ఎమ్మెల్యే స్టోన్ క్రషర్ యూనిట్‌కు తరలించారు. లీజు పొందిన ప్రాంతంలో ఖనిజ నిల్వలు తగ్గిపోవడంతో పక్కనే ఉన్న మరో 1.5హెక్టార్లలో లీజు అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపట్టి భారీగా రోడ్డు మెటల్ తరలించారు. ఏడాది కాలంగా ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా 6 లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా రోడ్డు మెటల్‌ను తన క్రషర్‌కు తరలించి భారీగా సొమ్ము చేసుకున్నట్లు గనులశాఖ అధికారుల తనిఖీల్లో తేలింది.

రూ.61.35 కోట్ల జరిమానా..

మాజీ ఎమ్మెల్యే బినామీ సాంబశివుడు క్వారీలో అక్రమ తవ్వకాలు చేసి రోడ్డు మెటల్ తరలించారు. దీంతో గనులశాఖ అధికారులు లీజు తీసుకున్న ప్రాంతానికి వెళ్లి కొలతలు తీశారు. లీజు ప్రాంతంతోపాటు పక్కనే ఉన్న మరో ప్రాంతంలో 1.5 హెక్టార్లలో అంటే 3.75 ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలు చేపట్టి 6.35 లక్షల క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్‌ను తరలించినట్లు గుర్తించి క్వారీ నిర్వాహకునికి నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులకు ఎటువంటి స్పందనా లేకపోవడంతో రూ.61.35 కోట్ల జరిమానా విధిస్తూ.. ఆ మొత్తం చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ చేయడంతో పాటు రోడ్డు మెటల్ క్వారీని సీజ్ చేశారు.



చియ్యేడు సమీపంలో అక్రమంగా తవ్వకాలు చేపట్టిన క్వారీ ఇదే

సీజ్ చేసినా ఆగని ఖనిజ రవాణా

జరిమానా చెల్లించే వరకు ఖనిజం తవ్వకాలు చేపట్టరాదని గనులశాఖ అధికారులు నోటీసులు జారీ చేసి, క్వారీని సీజ్ చేసినా నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు. క్వారీలో రాత్రి పూట అక్రమ తవ్వకాలు చేపట్టి రోడ్డు మెటల్‌ను మాజీ ఎమ్మెల్యే స్టోన్ క్రషర్ యూనిట్‌కు తరలిస్తున్నారు. సీజ్ చేసిన తర్వాత గనుల శాఖ అధికారులు క్వారీ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇదే అదనుగా భావించిన క్వారీ నిర్వాహకులు తవ్వకాలు చేపట్టి ఖనిజాన్ని తరలిస్తున్నారు. గనులశాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

పరిమితికి మించి తవ్వకాలు

క్వారీ లీజు తీసుకున్న ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి రోడ్డు మెటల్‌ను తరలించినట్లు గుర్తించాం. దాదాపు 6.35 లక్షల క్యూబిక్ మీటర్ల మేర మెటల్ తరలించారు. దీంతో క్వారీ నిర్వాహకుడు సాంబశివుడికి రూ.61.35 కోట్ల జరిమానా విధించి క్వారీని సీజ్ చేశాం. సీజ్ చేసిన ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్న విషయం మాకు తెలియదు. మరోమారు క్వారీని పరిశీలిస్తాం. అక్రమంగా తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసుకు సిఫార్సు చేస్తాం.

– నాగయ్య, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- ఒక్క విద్యార్థి ఫెయిలైనా హెచ్‌ఎంలదే బాధ్యత



వెబెక్స్‌లో మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు ఐదునెలల గడువు ఉందని, ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వి.నాగరాజు ఆదేశించారు. శనివారం జిల్లాలోని ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి వెబెక్స్ నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ గతంతో పోల్చితే ఈ సంవత్సరం అన్ని పరిస్థితులూ అనుకూలంగా ఉన్నాయన్నారు. కోవిడ్ కారణంగా గతంలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం అన్ని వసతులూ కల్పించిందన్నారు. చదువు చెప్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన, పర్యవేక్షించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపైన ఉందన్నారు. ఎఫ్‌ఏ-2 ఫలితాల ఆధారంగా గ్రేడింగ్ చేసుకుని వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్ పెట్టాలన్నారు. ఒక్క విద్యార్థి ఫెయిలైనా హెచ్‌ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

ఎంఈఓలు స్కూళ్లు తనిఖీ చేయాలి

మండల విద్యాశాఖ అధికారు(ఎంఈఓ)లు కచ్చితంగా రోజూ రెండు పాఠశాలలు తనిఖీ చేయాల్సిందేనని డీఈఓ స్పష్టం చేశారు. విద్యార్థుల నైపుణ్యం, వసతి, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించాలన్నారు. ప్రతి మండలానికీ ఇద్దరు ఎంఈఓలు ఉన్నారని, ఇద్దరూ రోజూ కనీసం నాలుగు స్కూళ్ల తనిఖీలు చేయాలని దిశా నిర్దేశం చేశారు.

విధుల్లో పునరంకితమవుదాం



అమరవీరుల స్తూపానికి పుష్పాంజలి ఘటిస్తున్న పోలీసు కుటుంబాల సభ్యులు



నివాళులర్పిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

- పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నది
- ప్రతి పోలీసు వీరమరణం ప్రజాసేవలో భాగమే
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: సమాజ భద్రత, రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసుల ఆశయాల స్ఫూర్తితో విధుల్లో పునరంకితం అవుదామని డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సిబ్బందికి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. తొలుత తెలుగుతల్లి విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా పోలీసు క్వార్టర్స్‌లోని అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ, ఎస్పీతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జిల్లా అటవీశాఖాధికారి సందీప్‌కృపాకర్ గుండాల, డీటీసీ వీర్రాజు, అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కరరెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు, డీఎస్పీలు ప్రసాద్ రెడ్డి, బి.శ్రీనివాసులు, సీఎం.గంగయ్య, మునిరాజ్, పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకరరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నదన్నారు. ఫ్యాక్షనిస్టులు, మావోయిస్టులు, రౌడీమూకలు, అసాంఘికశక్తులను అణచివేసే క్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోక తప్పదన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వస్తుందన్నారు. ప్రతి పోలీసు వీరమరణం ప్రజాసేవలో భాగమేనన్నారు. వారి కృషి, త్యాగ ఫలితం సమాజంలో అనేక మార్పులను, శాంతిని తెచ్చిపెట్టిందన్నారు. వారి త్యాగాలకు గురుతుగా జిల్లా వ్యాప్తంగా ఈ వారోత్సవాల్లో రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు, ఓపెన్ హౌస్, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్ర ప్రదర్శనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని పోలీసు అమర వీరులకు నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో పోలీసుల పట్ల, వారి సేవల పట్ల సరైన అవగాహన కల్పించి ఉత్తమ సమాజం వైపు నేటి తరాన్ని నడిపించాల్సిన బాధ్యత కూడా పోలీసుశాఖపై ఉందన్నారు.



పోలీసు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న డీఐజీ

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబాలను డీఐజీ అమ్మిరెడ్డితో పాటు ఎస్పీ అన్బురాజన్ ఓదార్చి ధైర్యం చెప్పారు. గత ఏడాది ప్రమాదాలు, ఇతర కారణాలతో చనిపోయిన పోలీసుల కుటుంబాలకు రూ.1.45 లక్షలు చెక్కు రూపంలో అందజేశారు. కారుణ్య నియామకం కింద ఒకరికి హోంగార్డు ఉద్యోగం ఇచ్చారు. కసాపురం పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న హోంగార్డు మస్తాన్ వలి కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య ఖాసీంబీకి ఆ ఉద్యోగాన్ని కేటాయిస్తూ నియామకపత్రం అందజేశారు.

చెంతకే సంక్షేమ ఫలాలు



నూతన సచివాలయ భవనం వద్ద మంత్రి ఉషశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

- మంత్రి ఉషశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యానికి శ్రీకారం చుట్టి ప్రజల చెంతకే సంక్షేమ ఫలాలు తీసుకొచ్చారని మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం కాలువపల్లిలో రూ.43.6 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనం ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి, మాజీ ఎమ్మెల్యేకు సర్పంచ్ ఎం.డి.పెద్దన్న, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటేశులు, నాయకులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. రిబ్బన్ కత్తిరించి భవనాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయం ద్వారా గ్రామస్థాయిలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో నిత్యం ప్రజాసంక్షేమానికి కృషిచేస్తూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందేలా చూస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, డీటీ మహబూబ్ పీరా, ఎంపీడీఓ రామచంద్ర, పంచాయతీరాజ్ జేఈ సుధాకర్, ఎంపీపీ పెద్దన్న, మాజీ సర్పంచ్ తిమ్మన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశులు, బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, మైనార్టీ విభాగం నాయకులు ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో జనరంజక పాలన

రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని మంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం వారు కాలువపల్లిలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మంత్రి, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసి 'ఆరోగ్య సురక్ష' క్యాంపులు నిర్వహిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికి 50 శాతం రిజర్వేషన్ కల్పించి కృషి చేస్తున్నారన్నారు.

దేవీ నమోస్తుతే!



గుత్తిలో వేంకటేశ్వరస్వామిగా వాసవీమాత

జిల్లా అంతటా దేవీ శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ఆలయాలతో పాటు ప్రత్యేక మంటపాల్లో కొలువుదీర్చిన అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. చల్లగా చూడు తల్లీ అంటూ కోరుకుంటున్నారు. – సాక్షి బృందం

పట్టాలపై పెను విషాదం

- రైలు ఢీకొని తల్లి, కుమారుడి దుర్మరణం

హిందూపురం అర్బన్: రైలు ఢీకొని తల్లి, కుమారుడు దుర్మరణం పాలైన ఘటన పెను విషాదం నింపింది. హిందూపురంలో ఈ ఘటన చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. హిందూపురం పట్టణంలోని వీవర్స్ కాలనీకి చెందిన బాబాజాన్, నూర్ ఫాతిమా (27) దంపతులు. వీరికి ఒక కుమారుడు అబ్దుల్‌ఖాన్ (3) ఉన్నాడు. గుజరీ వ్యాపారం చేసే బాబాజాన్ శనివారం ఉదయం ఆ పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. ఉదయం 10 గంటల సమయంలో ఏదో పని నిమిత్తం కుమారుడితో కలిసి ఫాతిమా బయలుదేరింది. ఈ క్రమంలోనే స్థానిక చౌడేశ్వరి దేవాలయం వద్ద పట్టాలు దాటుతుండగా, బెంగళూరు నుంచి ధర్మవరం వెళుతున్న ప్యాసింజర్ రైలు వీరిని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలైన ఇద్దరూ ఘటనాస్థలంలోనే ప్రాణాలు వదిలారు. లోకో పైలట్ సమాచారంతో రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన బాబాజాన్.. విగతజీవులుగా పడి ఉన్న భార్య, బిడ్డను చూసి గుండెలవిసేలా రోదించారు. మృతురాలి తల్లిదండ్రులు బెంగళూరులో ఉండడంతో వారికి సమాచారందించారు. ఒకే సమయంలో తల్లి,బిడ్డ మృత్యువాత పడటంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతి చెందిన ఫాతిమా, అబ్దుల్‌ఖాన్

సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్: యూపీఎస్సీ ద్వారా నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆర్థికంగా అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలు ఉండాలన్నారు. jnanabhumi.a p.gov.in వెబ్ సైట్ ద్వారా నవంబర్ 4లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2023 సంవత్సరంలో ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

జిల్లాకు మరిన్ని వైష్ణవాలయాలు

అనంతపురం కల్చరల్: టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మూడో ఫేజ్ కింద చేపట్టిన ఆలయాల నిర్మాణాల్లో భాగంగా జిల్లాకు మరిన్ని వైష్ణవాలయాలు మంజూరయ్యాయి. ఈ మేరకు జిల్లా ఎండోమెంటు సహాయ కమిషనర్ ఆదిశేషునాయుడు శనివారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల నివాస ప్రాంతాల్లో వేంకటేశ్వరాలయాలు, రామాలయాలు నిర్మించనున్నారు. ఇప్పటి వరకూ మొత్తం 68 ఆలయాలకు అనుమతులొచ్చాయి. ఇందులో మొదటి ఫేజ్‌లో 13, రెండో విడతలో 23 ఉండగా.. తాజాగా మూడో ఫేజ్ కింద 32 ఆలయాలు మంజూరయ్యాయి.

అమరుల త్యాగం మరువలేనిది

- సేవే పరమావధిగా విధులు నిర్వర్తించాలి
- జీఆర్పీ ఎస్పీ కె.చౌడేశ్వరి, ఆర్పీఎఫ్ డీఎస్పీ మురళీకృష్ణ



మాట్లాడుతున్న జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరుల త్యాగం మరువలేమని గుంతకల్లు జిల్లా జీఆర్పీ ఎస్పీ కె.చౌడేశ్వరి, ఆర్పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ టి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక జీఆర్పీ ఎస్పీ, ఆర్పీఎఫ్ కార్యాలయాల్లో వేర్వేరుగా పోలీసు అమరుల సంస్మరణ దినం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... సేవే పరమావధిగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. సమాజంలో ప్రజల మనుగడ పోలీసు సేవలతో ముడిపడి ఉందన్నారు. ప్రాణ, మాన, ఆస్తుల పరిరక్షణే కాకుండా శాంతి భద్రతలు కాపాడడంతో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి అమరులైన ఎందరో పోలీసు అధికారులు, కానిస్టేబుళ్ల భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జీఆర్పీ డీయస్పీ అబ్దుల్ అజీజ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామాంజనేయులు, ఐఆర్పీ ఆర్‌సీఆర్‌బీ కె.సాయినాథ్, సీఐ బీవీ నగేష్‌బాబు, ఏఆర్ ఎస్‌ఐ వెంకటరమణ, ఆర్పీఎఫ్ ఐపీఎఫ్ బెనయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి యువకుడి హత్య

- మద్యం మత్తులో బండరాతితో మోదిన పరిచయస్తులు
- గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



హతుడు షేక్ రఫీ

అనంతపురం క్రైం: మద్యం మత్తులో యువకుడిని కవ్వించి, దారుణంగా హతమార్చిన ఘటన అనంతపురం నగరంలో సంచలనం రేకెత్తించింది. ఘటన చోటు చేసుకున్న గంటల వ్యవధిలోనే నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను శనివారం సాయంత్రం అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ రెడ్డప్ప వెల్లడించారు. పామిడి గ్రామానికి చెందిన షేక్ రఫీ (34)కు అనంతపురంలోని పాతూరు రాణినగర్‌కు చెందిన రెహనాతో వివాహమైంది. రాణినగర్‌లోనే నివాసముంటూ బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలోనే రాణినగర్‌కు చెందిన పఠాన్ అలీఖాన్, సిమెంట్ లోడ్ చేసే వీరపెద్దన్న అలియాస్ వీర, బోయ రవికుమార్‌తో పరిచయమేర్పడింది. పని ముగించుకుని రోజూ కలసి మద్యం సేవించేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 10 గంటలకు పఠాన్ అలీఖాన్, వీరపెద్దన్న, బోయ రవి మద్యం సేవించి గుత్తి రోడ్డులోని ఐదు లైట్ల కూడలికి చేరుకున్నారు. అదే సమయంలో ఇంటికి వెళుతున్న రఫీని గమనించి మాటలతో కవ్వించారు. దీంతో రఫీ ఆ ముగ్గురినీ అసభ్యకరంగా దూషించాడు. దీంతో రెచ్చిపోయిన ముగ్గురూ బండరాయితో దాడి చేసి రఫీని హతమార్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో సీఐ రెడ్డప్ప, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బృందాలుగా విడిపోయి నిందితుల కోసం అన్వేషణ చేపట్టారు. ఎన్టీఆర్ మార్గ్‌లో భవానీనగర్ క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఐక్యతతోనే కురుబల రాణింపు



మంత్రి ఉషశ్రీ చరణ్‌ను కలిసిన కురుబ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం టవర్‌క్లాక్: ఐక్యతతోనే కురుబల రాణింపు సాధ్యమవుతుందని కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ అన్నారు. అనంతపురంలోని కనకదాస కల్యాణమంటపంలో శనివారం జరిగిన కురుబల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా కురుబ సంఘం నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా తుప్పటి ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆవుల కృష్ణయ్య, కోశాధికారిగా చిట్రా శీనయ్య, యువజన విభాగం అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రాగే మురళి ఎన్నికయ్యారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఉన్న మంత్రి ఉషశ్రీచరణ్‌ను నూతన కార్యవర్గసభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో గొర్రెల మేకల ఫెడరేషన్ చైర్మన్ నరసింహగౌడ్, కురుబ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఠల్ గౌడ్, నాయకులు రాజగోపాల్, బండి పరశురాం, కాశీ విశ్వనాథ్, కోరే విశ్వనాథ్, బుల్లే జగదీష్, శ్రీనివాసులు పాండు, బాల పోతన్న, గోవిందు, భీమేష్, మల్లికార్జున, ఆదినారాయణ, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన రాజకీయ సమాధి తథ్యం

- యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వంపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటున్న టీడీపీ, జనసేనకు రానున్న ఎన్నికల్లో రాజకీయ సమాధి తప్పదని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్ యాదవ్ అన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా విదేశాలకు వెళ్లాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం టోఫెల్ పై శిక్షణ ఇస్తుంటే దాన్ని ఓర్వలేని పవన్ కళ్యాణ్ దీనిపై కేసులు పెడతామంటూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. 'పవన్ కళ్యాణ్ నీకు బుద్ధి ఉందా? నీ కొడుకు విదేశాలకు వెళ్లి విద్యనభ్యసించవచ్చు..పేద విద్యార్థులు మాత్రం విదేశాలకు వెళ్లకూడదా? ఇదేనా పేద ప్రజలకు నీవు చేసే మేలు' అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పవన్ చౌకబారు విమర్శలు మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

లలితామాత నమోస్తుతే!



కొత్తూరు అమ్మవారిశాలలో లక్ష్మీనారాయణ, గరుడ, ఆంజనేయ అలంకరణ



లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో పార్వతీదేవి



ముత్యాల అలంకరణలో కొత్తకోట సుంకులమ్మ



దుర్గామాతకు పూజ చేస్తున్న వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన,అధ్యాపకులు, ఉద్యోగులు



రేణుక యల్లమ్మ అమ్మవారికి ధర్మాకోల్ పూసలతో అలంకరణ



శివబాలయోగి ఆశ్రమంలో పూజలందుకున్న అమ్మవారు



మున్సిపల్ కాంప్లెక్స్‌లో అలంకరణలో అమ్మవారు



పాతూరు అమ్మవారి శాలలో అమ్మవారు



కొత్తూరు అమ్మవారి శాలలో వెండి గజ్జలతో అలంకరణ

అనంతపురం కల్చరల్: నగరంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. శివబాలయోగి ఆశ్రమం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, రెండో రోడ్డులోని చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఐదోరోడ్డు సుంకులమ్మ, శృంగేరీ శంకర మఠం, శివకోటి, మారుతీనగర్ కోదండరామాలయంలో పూజలు చేశారు.

మేయర్‌కు ఆర్యవైశ్య సంఘాల సన్మానం : నగర మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. వారిని పాతూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

అనంతపురం అర్బన్: దేవీ నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక పాతూరు చెరువుకట్టపై వెలిసిన కొత్తకొట సుంకులమ్మకు పూజారి బెస్త వరలక్ష్మి శనివారం పూజలు చేశారు.

జేఎన్‌టీయూఏలో ఘనంగా ఆయుధ పూజ

అనంతపురం: జేఎన్‌టీయూఏలో శనివారం ఆయుధ పూజ చేశారు. వీసీ జింకా రంగజనార్దన రిజిస్ట్రార్ శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ కేశవ రెడ్డి, హెచ్‌ఓడీలు ఎస్.చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ కల్యాణి రాధ, ఎం. రామశేఖర్ రెడ్డి, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ దిలీప్ కుమార్, అజిత పాల్గొన్నారు.

రాప్తాడు: మండల కేంద్రంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని పార్వతీదేవి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఫైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



నగరంలోని ఎర్రనేలకొట్టాలలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలకు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగాన్ని బలోపేతం చేశారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం 1వ డివిజన్‌లోని ఎర్రనేలకొట్టాల్లో రూ.90 లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం అందులోని గదులను మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో మొత్తం 10 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయన్నారు. ఒక్కో నూతన భవనానికి రూ.80 లక్షల నుంచి రూ.1.20 కోటి వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రతి కేంద్రంలో 64 రకాల వైద్య పరీక్షలు, 172 రకాల మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.3 లక్షల వార్షిక ఆదాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచడమే కాకుండా, ప్రస్తుతం 3,256 వ్యాధులకు ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మేయర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోనే రూ.300 కోట్లతో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్, బాయ్స్, గర్ల్స్ హాస్టల్, సూపర్ స్పెషాలిటీ వద్ద రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు లాలూ, ఇసాక్, శ్రీనివాసులు, సైపుల్లాబేగ్, నాయకులు బీ హనుమంతు, కే ఫక్రుద్దీన్, వీరన్న, కాలేశ, ఇర్షాద్, కే శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపు తనిఖీ.. : నగరంలోని రాణినగర్ ఆశా స్కూల్‌లో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందుతున్నసేవలను అడిగి తెలుసుకున్నారు. జేసీఎస్ కన్వీనర్ బోయ లక్ష్మన్న, కార్పొరేటర్లు సుమతి, వై.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. **రాప్తాడు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని మండల ప్రత్యేకాధికారి ఉమా మహేశ్వరమ్మ, మండల వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని ఎం.బండమీదపల్లిలో గ్రామ సచివాలయం దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపుగా 408 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 19 మందిని శస్త్ర చికిత్సల కోసం అనంతపురానికి రెఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ సాల్మన్, సర్పంచు ఉమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, వైఎస్సార్ సీపీ నాయకులు పక్కీరప్ప, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు స్పందన

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి రూరల్ సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపునకు ప్రజలు తరలివచ్చారు. సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై. పుల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు జూటూరు పెన్నోబులేసు, ఉప సర్పంచ్ బండి రమేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లుమడి శ్రీనివాసులు, గాండ్ల బయప్ప, వార్డు సభ్యులు, డాక్టర్లు మనోజ్, నందకిరణ్, అనన్య, సాయి గణేష్ పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, వీఆర్‌ఓ ఓబులేసు, సచివాలయ ఉద్యోగులు ఏఎన్‌ఎం గౌరీ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: దసరా పండుగను పురస్కరించుకొని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఆమె క్యాంపు కార్యాలయంలో పారిశుద్య కార్మికులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణా రెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం: క్రీడలతో మానసిక, శారీరక వికాసం సాధ్యమని నగర మేయర్ వసీం అన్నారు. పీటీసీ మైదానంలో వాలీబాల్ ఆటగాళ్ల ముస్తఫా అలీఖాన్, నగేష్ కుమార్ జ్ఞాపకార్థం శనివారం వాలీబాల్ టోర్నీ ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రా రెడ్డి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి హాజరయ్యారు. తొలి రోజు 20 పురుషుల జట్లు, 10 మహిళల జట్లు హాజరయ్యాయి. క్వార్టర్స్ ఫైనల్స్ ముగిసింది. సెమీ ఫైనల్స్ ఆదివారం నిర్వహించనున్నారు.వాలీబాల్ అసోసియేషన్ చైర్మన్ సీఐ సాయి ప్రసాద్, కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి శేషాద్రి, సీనియర్ క్రీడాకారులు జైను, గౌడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతపురం క్రైం: భార్య దాడిలో గాయపడిన గొల్ల జయసూర్యరెడ్డి (50) కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. జయసూర్యరెడ్డి తలపై భార్య వేటకొడవలితో నరకడంతో మెదడుకు తీవ్ర గాయమైంది. నిందితురాలు ప్రమీలను నాల్గో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

అనంతపురం అర్బన్: ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం తక్షణం చెల్లించాలని ఎస్టీయూ నాయకులు కలెక్టరేట్ వద్ద శనివారం దీక్షలు చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూర్యుడు, రమణారెడ్డి మాట్లా డారు. దీక్షల్లో నాయకులు చంద్రశేఖర్, కృష్ణమూర్తి,రామాంజినేయులు, ఫణిభూషణ్, ప్రసాద్, రంగనాథ్, రాజశేఖర్, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించిన జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్, పోలీసులు

అనంతపురం సిటీ: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అనంతపురం జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలోని జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కుమార్, కానిస్టేబుళ్లు రేణుక, ముత్యాలమ్మ, నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

జూపల్లి సేవలు చిరస్మరణీయం



జూపల్లి ప్రేమ్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య

అనంతపురం కల్చరల్: జూపల్లి ప్రేమ్‌చంద్ సాహితీవేత్తగా, సామాజిక ఉద్యమకారుడిగా అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. శనివారం స్థానిక ఆర్ట్స్‌కళాశాలలో మహాబోధి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జూపల్లి ప్రేమ్‌చంద్ సంస్మరణ సభ జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు మహాబోధి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ రంగయ్య, ఆచార్య బాలసుబ్రమణ్యం, తరిమెల అమరనాథరెడ్డి, కళారత్న బిక్కికృష్ణ తదితరులు మాట్లాడారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంక మౌళి, విశ్రాంత ప్రిన్సిపాల్ రంగస్వామి, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు బోసు, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, నాగలింగయ్య, రియాజుద్దీన్, చం.శాస్త్రి, అనంత జిరసం జిల్లా ప్రధాన కార్యదర్శి తోటనాగరాజు, కుళ్లాయప్ప, జెట్టీ జైరామ్, నబీ రసూల్, చిలుకూరు దీవెన, లక్ష్మీదేవి, జూటూరు షరీఫ్, నల్లప్ప తదితరులు జూపల్లితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఇస్కాన్ సేవాభావం అభినందనీయం

- ప్రత్యేక పూజల్లో మంత్రి ఉషశ్రీచరణ్



ఇస్కాన్ గోశాలలో గోవుకు అరటిపండు తినిపిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ మందిరాల సేవలు అభినందనీయమని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. శనివారం ఆమె నగరంలోని ఇస్కాన్ గోశాలను సందర్శించి, అక్కడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోవులకు గ్రాసం అందించి, పూజలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్ష పాలనసాగుతోందన్నారు. అనంతరం గోశాలలోని వేంకటేశ్వరాలయంలో మంత్రితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కల్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు జోసఫ్ కిషోర్, కోఆప్షన్ సభ్యుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ఏడుకొండలవాడి దివ్యదర్శనం



చంద్రప్రభ వాహనంపై విహరించిన వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆర్ఎఫ్‌రోడ్డు, హౌసింగ్ బోర్డు, శ్రీనివాసనగర్ తదితర చోట్ల శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకార సేవలతో పాటు దీక్షా హోమాలు నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో రైల్వేఫీడర్ రోడ్డు వేంకటేశ్వరాలయం సందడిగా మారింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, పాలకమండలి సభ్యులు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ట



నూతనంగా ప్రతిష్ఠించిన అభయాంజనేయ విగ్రహం

రాప్తాడు: మండలంలోని బోగినేపల్లి గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో 26 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను శనివారం ప్రారంభించారు. ఉదయం 8.30 గంటలకు విగ్రహ దాత (శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబ ఆలయ సూపరింటిండెంట్) చాగంటి మధుసూదన్ రెడ్డి, ఆయన సతీమణి చాగంటి నాగమ్మ చేతుల మీదుగా కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి హాజరయ్యారు. ఎంపీటీసీ సభ్యురాలు చాగంటి లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు చాగంటి నారాయణ రెడ్డి, రామకృష్ణ, ఓబిరెడ్డి, భాస్కర్ రెడ్డి, నరసింహులు, బండి నరేంద్ర, వన్నూర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో వేడుకలు

అనంతపురం రూరల్: స్థానిక శిల్పారామంలో దసరా పండగను పురస్కరించుకొని రెండు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్య ఆది డ్యాన్స్ అకాడమీ, మురళీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జిల్లా మ్యూజియంకు జైన విగ్రహం



వివరాలు తెలుపుతున్న పురావస్తు శాఖ ఏడీ రజిత

అనంతపురం కల్చరల్: చరిత్రకు అద్దం పట్టే ఎన్నో అరుదైన విగ్రహాలు జిల్లాలో బయటపడుతున్నాయని జిల్లా పురావస్తు శాఖ ఏడీ రజిత వెల్లడించారు. కొన్ని నెలల క్రితం రాయదుర్గం ప్రాంతంలో బయటపడిన 24వ జైన తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుడి విగ్రహాన్ని జిల్లా మ్యూజియంకు తరలించినట్లు పేర్కొన్నారు. జైన సంప్రదాయంలో 23 మంది తీర్థంకరుల విగ్రహాలు పద్మాసనంలో ఉంటాయని, అయితే రాయదుర్గం ప్రాంతంలో లభ్యమైన విగ్రహం నిలబడి ఉండడంతో వర్ధమాన మహావీరుడిదిగా గుర్తించినట్లు వివరించారు. ఇదే అంశాన్ని కన్నడ లిపిలో శాసనం లిఖించినట్లుగా తెలిపారు. కాగా, ఈ విగ్రహాన్ని క్రీ.శ. 1355 కాలం నాటిదిగా చరిత్రకారులు గుర్తించారు.

హమాలీల నిరసన

అనంతపురం అర్బన్: స్థానిక జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయం ఎదుట మండల లెవల్ స్టాక్ పాయింట్ల హమాలీలు వేతనం, బోనస్ చెల్లించాలని శనివారం నిరసన తెలియజేశారు. సివిల్ సప్లయీస్ హమాలీ సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్‌వీనాయుడు మాట్లాడుతూ హమాలీలకు వేతనం, బోనస్‌ను అనంతపురం జిల్లాలో తప్ప రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాల్లో చెల్లించారన్నారు. సమస్యపై సంస్థ అసిస్టెంట్ మేనేజర్ వెంకటరామిరెడ్డి స్పందిస్తూ హమాలీల ఖాతాల్లో తక్షణం వేతనం జమయ్యేలా చూస్తామన్నారు. దీంతో వారు నిరసన విరమించారు. కార్యక్రమంలో సంఘం జిల్ల అధ్యక్షుడు నారాయణస్వామి, నాయకులు సుబాన్, నారాయణస్వామి, శంకర్, హమాలీలు పాల్గొన్నారు.

'ఐదు' ఎవరి ఖాతాలో..?

నేడు ప్రపంచకప్‌లో భారత్, న్యూజిలాండ్ పోరు

- నాలుగు విజయాలతో సమఉజ్జీలుగా ఇరు జట్లు
- గెలిచిన టీమ్ అగ్రస్థానానికి
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్షప్రసారం





కోహ్లి

ధర్మశాల: క్రికెట్ అభిమానుల కోసం మరో ఆదివారం అసలైన వినోదానికి రంగం సిద్ధమైంది. ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు విజయాలతో అజేయంగా సాగుతున్న జట్లు నేడు జరిగే పోరులో ముఖాముఖీ తలపడనున్నాయి. ప్రపంచంలోని అందమైన క్రికెట్ వేదికల్లో ఒకటైన ధర్మశాలలో నేడు న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. సొంతగడ్డపై సమష్టి ప్రదర్శనతో టీమిండియా చెలరేగిపోతుండగా...ఫేవరెట్‌లుగా భావించిన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను వెనక్కి నెట్టి గత రన్నరప్ న్యూజిలాండ్ ముందుకు దూసుకొచ్చింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని అందుకునేందుకు జరిగే ఈ పోరులో ఎవరిది పైచేయి కానుందనేది ఆసక్తికరం.

పాండ్యా స్థానంలో ఎవరు?

జోరు మీదున్న భారత్‌కు గత మ్యాచ్ తర్వాత అనూహ్య సమస్య వచ్చింది. గాయపడిన హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అతని స్థానంలో ఎవరిని ఎంచుకుంటారనేది కీలకంగా మారింది. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే నేరుగా షమీకి అవకాశం దక్కవచ్చు. అయితే బ్యాటింగ్ బలహీనంగా మారే అవకాశం ఉంది. దాంతో సూర్యకుమార్ లేదా ఇషాన్ కిషన్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. అలా చేస్తే శార్దుల్ ఠాకూర్ పూర్తి స్థాయిలో ఐదో బౌలర్‌గా తన బాధ్యతను నిర్వర్తించాల్సి ఉంటుంది. భారత బ్యాటర్లంతా మంచి ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం. రోహిత్, కోహ్లి, గిల్, రాహుల్ అద్భుత ఆటతో కొనసాగిపోతున్నారు. రోహిత్, కోహ్లి దూకుడు భారత్‌కు మరో సారి గెలుపు అవకాశాలు సృష్టించగలదు. ఇప్పటి వరకు టీమిండియాకు లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌కు పరీక్షించే అవకాశం రాలేదు. కానీ కివీస్ బౌలర్లు చెలరేగితే వారు కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. బుమ్రా, సిరాజ్‌లతో పేస్ బౌలింగ్ పదునుగా ఉంది. కుల్దీప్‌ను ఒక్క ప్రత్యర్థి కూడా సమర్థంగా ఎదుర్కోలేకపోయాడు. జడేజా స్పిన్ కూడా కివీస్‌ను కట్టడి చేయగలదు.

అదే జట్టుతో...

మొదటినుంచీ కివీస్ నమ్ముకున్న సమష్టితత్వమే ఆ జట్టును గెలిపిస్తోంది. గత నాలుగు మ్యాచ్‌లలో కూడా అది కనిపించింది. ఒకరు విఫలమైతే మరొకరు ఆ బాధ్యతను తీసుకుంటున్నారు. అందుకే న్యూజిలాండ్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగనుంది. విలియమ్సన్, సౌతీ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచ్‌కూ దూరమయ్యాడు. కాన్వే, యంగ్ శుభారంభాలు అందిస్తుండగా రచిన్, లాథమ్ దానిని కొనసాగిస్తున్నారు. ఫిలిప్స్, చాప్‌మన్ మెరుపులు జట్టుకు భారీ స్కోరు అందిస్తున్నాయి. ఇక పేస్ బౌలింగ్ దళం చాలా పదునుగా ఉంది. బౌల్ట్, హెన్రీలను ఎదుర్కోవడం భారత్‌కు అంత సులువు కాదు. వీరితో పాటు ఫెర్గూసన్, సాన్‌ట్నర్ కూడా సత్తా చాటగలరు.

పిచ్, వాతావరణం

పిచ్‌పై కాస్త పచ్చిక ఉంటుంది. స్వింగ్, బౌన్స్‌కు మంచి అనుకూలం. పేసర్లకు సానుకూలాంశం. బ్యాటర్లు నిలదొక్కుకుంటే పరుగులు రావచ్చు. మ్యాచ్ రోజు చల్లటి వాతావరణం ఉంటుంది. వర్షసూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, జడేజా, శార్దుల్, షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

న్యూజిలాండ్: లాథమ్ (కెప్టెన్), కాన్వే, యంగ్, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, సాన్‌ట్నర్, హెన్రీ, ఫెర్గూసన్, బౌల్ట్

క్లాసెన్ కమాల్ ఇంగ్లండ్ ఢమాల్

- క్లాసెన్ మెరుపు శతకం
- జాన్సెన్ సిక్సర్ల వర్షం
- ఇంగ్లండ్‌పై 229 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా భారీ విజయం

డిఫెండింగ్ చాంపియన్ ఆట ఇంతేనా అనిపించేలా... అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో చెత్త ప్రదర్శన చూపిస్తూ... ఇంగ్లండ్ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. కొత్త వ్యూహం, కీలక మార్పులతో బరిలోకి దిగి టాస్ నెగ్గిన అనుకూలతను కూడా సొమ్ము చేసుకోలేక చేతులెత్తేసింది. వన్డే వరల్డ్‌కప్‌లో టైటిల్ నిలబెట్టుకోవడానికి వచ్చిన జట్టు టి20లా 22 ఓవర్లకే ఆలౌట్ కావడమేంటి... కూన అఫ్గాన్ చేతిలో ఓడిన జట్టు ఇక ఆదమరిస్తే కుదరదని అన్నీ అస్త్ర శస్త్రాలకు పదును పెట్టి బలమైన ప్రత్యర్థితో సై అంటుంది. కానీ ఇంగ్లండ్ తీరు చూస్తే అస్త్ర శస్త్రాలన్నీ అటకమీద పెట్టి మైదానంలో ఏదోలా ఆడేందుకు వచ్చినట్లుగా అనిపించింది. మరో వైపు దక్షిణాఫ్రికా మాత్రం నెదర్లాండ్స్ చేతిలో ఓడిన చేదు అనుభవాన్ని మరచి కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగింది. బ్యాటర్ల బాధ్యత, అందరి బౌలర్ల సమష్టి కృషి వరల్డ్‌కప్‌లో సఫారీలకు అసాధారణ విజయాన్నిచ్చింది. ఈ గెలుపులో క్లాసెన్, జాన్సెన్ జట్టు హీరోలుగా నిలిచారు.



క్లాసెన్



బట్లర్



జాన్సెన్

ముంబై: ఇంగ్లండ్ డిఫెండింగ్ చాంపియన్‌లా ఆడలేదు. దక్షిణాఫ్రికాలాంటి పటిష్టమైన జట్టు చేతిలో సాదాసీదా క్రికెట్ కూనలా ఓడింది. బౌలింగ్‌లో విలాపం, బ్యాటింగ్‌లో వైఫల్యంతో ఇంగ్లండ్ చిత్తయింది. శనివారం జరిగిన ప్రపంచకప్‌లో పోరులో దక్షిణాఫ్రికా 229 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 399 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెన్రిచ్ క్లాసెన్ (67 బంతుల్లో 109; 12 ఫోర్లు, 4 సిక్సలు) సునామీ ఆటతో సెంచరీ సాధించగా, రీజా హెండ్రిక్స్ (75 బంతుల్లో 85; 9 ఫోర్లు, 3 సిక్సలు), మార్కో జాన్సెన్ (42 బంతుల్లో 75 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్సలు), వాన్‌డర్ డసెన్ (61 బంతుల్లో 60; 8 ఫోర్లు) చెలరేగారు. హెండ్రిక్, డసెన్ 116 బంతుల్లో 121 పరుగులు జోడించగా... క్లాసెన్, జాన్సెన్ ఓవర్‌కు 12 పరుగుల రన్‌రేట్‌తో 12.5 ఓవర్లలోనే 151 పరుగులు జత చేయడం విశేషం. 61 బంతుల్లోనే క్లాసెన్ సెంచరీ పూర్తయింది. తర్వాత భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 22 ఓవర్లు మాత్రమే ఆడి 170 పరుగుకే కుప్పకూలింది. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన మార్క్ వుడ్ (17 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) తప్ప ఇంకెవరూ చెప్పుకునేంత స్కోరు, జట్టు పరువు నిలిపే పోరాటమైనా చేయలేకపోయారు. ప్రధాన బ్యాటర్లంతా విఫలం కాగా, చివర్లో వుడ్ పోరాటం ఆ జట్టు అట్టడుగునకు చేరకుండా ఆపింది. 400 పరుగుల లక్ష్యాన్ని చూడగానే భీతిల్లినట్లుగా ఇంగ్లండ్ బ్యాటింగ్ వరుస కునారిల్లింది. టాపార్డర్‌లో బెయిర్ స్టో (10), మలాన్ (6), రూట్ (2) కలిపి చేసిన స్కోరు 18 దాటలేదు. మిడిలార్డర్‌లో బ్రూక్ (17), బట్లర్ (15), విల్లీ (12) రెండంకెల స్కోర్లు చేశారంతే. టెయిలెండర్ అట్కిన్సన్ (21 బంతుల్లో 35; 7 ఫోర్లు) కొద్దిసేపు క్రీజ్‌లో నిలిచాడు. తాజా ఫలితంతో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలకు పెద్ద దెబ్బ పడింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) బట్లర్ (బి) టాప్లీ 4; హెండ్రిక్స్ (బి) రషీద్ 85; డసెన్ (సి) బెయిర్‌స్టో (బి) రషీద్ 60; మార్క్‌రమ్ (సి) బెయిర్‌స్టో (బి) టాప్లీ 42; క్లాసెన్ (బి) అట్కిన్సన్ 109; మిల్లర్ (సి) స్టోక్స్ (బి) టాప్లీ 5; జాన్సెన్ నాటౌట్ 75; కోయెట్జీ (సి) సబ్–లివింగ్‌స్టోన్ (బి) అట్కిన్సన్ 3; కేశవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 399. వికెట్ల పతనం: 1–4, 2–125, 3–164, 4–233, 5–243, 6–394, 7–398. వికెట్ల పతనం: 1–4, 2–125, 3–164, 4–233, 5–243, 6–394, 7–398. బౌలింగ్: టాప్లీ 8.5–0–88–3, విల్లీ 9–1–61–0, రూట్ 6.1–0–48–0, అట్కిన్సన్ 9–0–60–2, వుడ్ 7–0–76–0, ఆదిల్ రషీద్ 10–0–61–2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్ స్టో (సి) డసెన్ (బి) ఇన్‌గిడి 10; మలాన్ (సి) డికాక్ (బి) జాన్సెన్ 6; జో రూట్ (సి) మిల్లర్ (బి) జాన్సెన్ 2; స్టోక్స్ (సి) అండ్ (బి) రబడ 5; బ్రూక్ (ఎల్బీ) (బి) కోయెట్జీ 17; బట్లర్ (సి) డికాక్ (బి) కోయెట్జీ 15; విల్లీ (సి) రబడ (బి) ఇన్‌గిడి 12; ఆదిల్ రషీద్ (సి) హెండ్రిక్స్ (బి) కోయెట్జీ 10; అట్కిన్సన్ (బి) కేశవ్ 35; వుడ్ నాటౌట్ 43; టోప్లీ ఆబ్సెంట్‌హర్ట్ ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (22 ఓవర్లలో ఆలౌట్) 170. వికెట్ల పతనం: 1–18, 2–23, 3–24, 4–38, 5–67, 6–68, 7–84, 8–100, 9–170. బౌలింగ్: ఇన్‌గిడి 5–1–26–2, జాన్సెన్ 5–0–35–2, రబడ 6–1–38–1, కోయెట్జీ 4–0–35–3, కేశవ్ 2–0–27–1.

శ్రీలంకకు తొలి విజయం

- 5 వికెట్లతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన సమరవిక్రమ

లక్నో: ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాల తర్వాత ఎట్టకేలకు మాజీ చాంపియన్ శ్రీలంక ఖాతాలో తొలి గెలుపు చేరింది. గత మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించిన నెదర్లాండ్స్ ఈ సారి అదే జోరును కొనసాగించలేకపోయింది. శనివారం జరిగిన ఈ పోరులో లంక 5 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 49.4 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. సైబ్రాండ్ ఎంగెల్‌బ్రెట్ (82 బంతుల్లో 70; 4 ఫోర్లు, 1 సిక్స్), లోగన్ వాన్ బీక్ (75 బంతుల్లో 59; 1 ఫోర్, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించారు. 21.2 ఓవర్లలోనే హాలండ్ 91 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడగా...సైబ్రాండ్, వాన్ బీక్ ఏడో వికెట్‌కు 130 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్ల ధాటికి ఒక దశలో వరుసగా 20.4 ఓవర్ల పాటు డచ్ టీమ్ కనీసం ఒక్క ఫోర్ కూడా కొట్టలేకపోయింది. పేసర్లు మదుషంక, రజిత చెరో 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశారు. లంక 26 వైడ్‌లు సహా మొత్తం 33 ఎక్స్‌ట్రాలు ఇవ్వడం విశేషం. ఇందులో కీపర్ హెల్మెట్‌కు బంతి తగలడంతో ఇచ్చిన ఐదు పెనాల్టీ పరుగులు కూడా ఉన్నాయి. అనంతరం లంక 48.2 ఓవర్లలో 5 వికెట్లకు 263 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సదీర సమరవిక్రమ (107 బంతుల్లో 91 నాటౌట్; 7 ఫోర్లు) చివరి వరకు నిలబడి జట్టును గెలిపించగా...పతుమ్ నిసాంక (52 బంతుల్లో 54; 9 ఫోర్లు), చరిత్ అసలంక (66 బంతుల్లో 44; 2 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వ (37 బంతుల్లో 30; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.



స్కోరు వివరాలు:

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (ఎల్బీ) (బి) రజిత 4; మ్యాక్స్ ఒ డౌడ్ (బి) రజిత 16; అకెర్‌మన్ (సి) మెండిస్ (బి) రజిత 29; డి లీడ్ (సి) పెరీరా (బి) మదుషంక 6; తేజ (ఎల్బీ) (బి) మదుషంక 9; ఎడ్వర్డ్స్ (బి) తీక్షణ 16; సైబ్రాండ్ (బి) మదుషంక 70; వాన్‌బీక్ (సి) అసలంక (బి) రజిత 59; వాండర్‌మెర్వ్ (సి) మెండిస్ (బి) మదుషంక 7; ఆర్యన్ దత్ (నాటౌట్) 9; మీకెరెన్ (రనౌట్) 4; ఎక్స్‌ట్రాలు 33; మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 262. వికెట్ల పతనం: 1–7, 2–28, 3–54, 4–68, 5–71, 6–91, 7–221, 8–244, 9–252, 10–262. బౌలింగ్: మదుషంక 9.4–1–49–4, రజిత 9–0–50–4, కరుణరత్నే 9–1–58–0, తీక్షణ 10–0–44–1, హేమంత 8–0–42–0, ధనంజయ 4–0–13–0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) ఎడ్వర్డ్స్ (బి) మీకెరెన్ 54; పెరీరా (సి) డి లీడ్ (బి) దత్ 5; మెండిస్ (సి) మీకెరెన్ (బి) దత్ 11; సమరవిక్రమ (నాటౌట్) 91; అసలంక (బి) దత్ 44; ధనంజయ (బి) అకెర్‌మన్ 30; హేమంత (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (48.2 ఓవర్లలో 5 వికెట్లకు) 263. వికెట్ల పతనం: 1–18, 2–52, 3–104, 4–181, 5–257. బౌలింగ్: ఆర్యన్ దత్ 10–0–44–3, వాన్ బీక్ 10–0–57–0, మీకెరెన్ 8–1–39–1, డి లీడ్ 3–0–29–0, వాన్‌డర్ మెర్వ్ 9–0–42–0, అకెర్‌మన్ 8.2–0–39–1.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	4	3	1	6	2.212
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

నేటి నుంచి పారా ఆసియా క్రీడలు

- వారం పాటు ఈవెంట్
- 313 మందితో భారత బృందం



హాంగ్జౌ: ఇటీవల ఇక్కడే జరిగే ఆసియా క్రీడల్లో ముందెన్నడు లేని విధంగా రికార్డు స్థాయిలో పతకాలు సాధించిన భారత బృందంలాగే పారా అథ్లెట్లు కూడా గంపెడాశలతో పారా ఆసియా క్రీడలకు సిద్ధమయ్యారు. ఆదివారం నుంచి ఈ నెల 28 వరకు జరుగనున్న ఈ పోటీల్లో భారత దివ్యాంగ అథ్లెట్లు సత్తాచాటాలని గట్టి పట్టుదలగా ఉన్నారు. గత టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించిన అవని లేఖరా, సుమిత్ అంటిల్‌లు భారత బృందాన్ని ముందుండి నడిపించనున్నారు. టోక్యోలో 2021లో జరిగిన మెగా ఈవెంట్‌లో స్టార్ షూటర్ అవని బంగారంతో పాటు కాంస్యం గెలిచింది. జావెలిన్ త్రోయర్ అంటిల్ కూడా పసిడి పట్టాడు. వీరితో పాటు పతకం ఆశలున్న పారా షూటర్ మనీశ్ నర్వాల్, షట్లర్లు ప్రమోద్ భగత్, కృష్ణ నగర్‌లు సహా మొత్తం 313 మందితో కూడా భారత పారా అథ్లెట్ల బృందం హాంగ్జౌలో పతకాల వేట మొదలుపెట్టేందుకు సై అంటోంది. మొత్తం 22 క్రీడాంశాలు నిర్వహిస్తుండగా భారత అథ్లెట్లు 17 క్రీడాంశాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సరిగ్గా వారం రోజుల పాటు జరిగే ఈ పారా మెగా ఈవెంట్‌లో 43 దేశాలకు చెందిన సుమారు 4000 మంది అథ్లెట్లు పోటీపడనున్నారు. 22 క్రీడాంశాల్లో 566 గోల్డ్ మెడల్ ఈవెంట్లున్నాయి. తొలిసారిగా 2010లో గ్వాంగ్‌జౌలో పారా ఆసియా క్రీడలు జరిగాయి. ఇందులో భారత బృందం 14 పతకాలు సాధించి 15వ స్థానంలో నిలిచింది. 2018లో జరిగిన గత పారా ఈవెంట్‌లో భారత అథ్లెట్లు మొత్తం 72 పతకాలు సాధించి టాప్–10లో తొమ్మిదో స్థానంలో నిలిచారు. ఈ సారి పతకాల సెంచరీ మార్కు దాటించేందుకు భారత అథ్లెట్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. షూటింగ్‌లో క్రితం సారి మూడు పతకాలే వచ్చాయి. అయితే అవని జకార్తా (2018) ఈవెంట్‌లో ఆడలేదు. ఇప్పుడు స్టార్ షూటర్ అందుబాటులో ఉండటంతో షూటింగ్‌లోనూ పతకాల సంఖ్య ఆశించినంత పెరగొచ్చు.

మళ్లీ మరీన్ చేతిలో...

పీవీ సింధుకు మరో పరాజయం



ఒడెన్స్: పీవీ సింధు, కరోలినా మరీన్ మధ్య మంచి స్నేహం ఉంది. కోర్టులో ప్రత్యర్థులే అయినా కోర్టు బయట తమ సాన్నిహిత్యం గురించి వీరిద్దరు చాలా సార్లు చెప్పుకున్నారు. కానీ శనివారం ఇద్దరి మధ్య జరిగిన హోరాహోరీ పోరు అనూహ్య రీతిలో సాగింది. ఒక దశలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రత్యర్థిపై పైచేయి సాధించే క్రమంలో అరుపులు, కేకలతో పాటు పలు మార్లు ఇద్దరూ అంపైర్ల హెచ్చరికకు కూడా గురయ్యారు. అయితే చివరకు 73 నిమిషాల సమరం తర్వాత భారత షట్లర్ పరాజయం పక్షానే నిలిచింది. ఈ మ్యాచ్‌కు ముందు ముఖాముఖీ రికార్డులో సింధు 5–10తో వెనుకబడి ఉండగా, ఇప్పుడు అది 5–11కు చేరింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీ డెన్మార్క్ ఓపెన్ సెమీ ఫైనల్లో సింధు ఓటమిపాలైంది. కరోలినా మరీన్ (స్పెయిన్) 21–18, 19–21, 21–7 స్కోరుతో సింధుపై విజయం సాధించింది.

ఇద్దరు ప్లేయర్లు తమదైన శైలిలో చెలరేగడంతో తొలి గేమ్ దాదాపు సమంగా సాగింది. విరామ సమయంలో సింధు 11–10తో ఒక పాయింట్ ముందంజలో ఉంది. ఆ తర్వాతా ఇదే కొనసాగి స్కోరు 18–18కి చేరింది. అయితే మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలుచుకొని గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం సింధు దూసుకుపోయింది. చకచకా పాయింట్లు సాధించిన ఆమె ఎక్కడా ఆధిక్యం తగ్గనీయకుండా 11–3కు చేరింది. అయితే ఆ తర్వాత ప్రతిఘటించిన మరీన్ వరుసగా పాయింట్లు గెలుచుకొని అంతరాన్ని తగ్గించింది. సింధు 20–16తో ముందంజలో నిలిచిన తర్వాత మరీన్ వరుసగా మూడు పాయింట్లు గెలవడంతో 20–19గా మారింది. కానీ స్మాష్‌తో పాయింట్ సాధించి సింధు గేమ్ గెలుచుకుంది. చివరి గేమ్ మాత్రం పూర్తి ఏకపక్షంగా మారిపోయింది. మరీన్ జోరు ముందు భారత షట్లర్ నిలవలేకపోయింది. ముందు 3–0, ఆపై 3–2...ఆ తర్వాత ఆమె జోరు సాగిపోయింది. వరుసగా 11 పాయింట్లు సాధించిన మరీన్ 14–2 దాకా వెళ్లింది. అనంతరం మ్యాచ్‌ను ముగించేందుకు ఆమెకు ఎక్కువ సమయం పట్టలేదు.

మరీన్ అరుపులు... సింధు అసహనం

పాయింట్లు సాధించినప్పుడు అతిగా భావోద్వేగాలు ప్రదర్శించవద్దని అంపైర్ ఇద్దరినీ పిలిచి మ్యాచ్‌లో పలు మార్లు వారించాడు. అయితే మరీన్ తన అరుపులను ఆపకపోగా, సర్వీస్ అందుకునేందుకు సింధు ఎక్కువ సమయం తీసుకుంది. తొలి గేమ్‌ను మరీన్‌ను మళ్లీ అంపైర్ హెచ్చరించాడు. మూడో గేమ్‌లో సర్వీస్ ఆలస్యానికి సింధును అంపైర్ ప్రశ్నించగా...' ఆమె అరిచేందుకు అవకాశమిచ్చారు కదా. ముందు ఆమెను ఆపమని చెబితే నేనూ సిద్ధంగా ఉంటా' అని సింధు బదులిచ్చింది. మరొకరి కోర్టునుంచి షటిల్ తీసుకోవద్దని ఇద్దరికీ చెప్పాల్సి వచ్చింది. చివరకు అంపైర్ ఇద్దరికీ 'ఎల్లో కార్డు'లు కూడా చూపించాల్సి వచ్చింది.

సినిమా

సరదా.. దసరా..



● ఈషా డియోల్, హేమా మాలిని, రాణీ ముఖర్జీ



● కాజోల్



● దులారీ ఖేర్, అనుపమ్ ఖేర్

బాలీవుడ్‌లో దసరా సందడి జోరు బాగా కనిపిస్తోంది. ప్రతి ఏడాదీ కొందరు స్టార్స్ ప్రముఖ ఏరియాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించే చోటుకి వెళ్లి, పూజలు చేస్తుంటారు. ముఖ్యంగా కాజోల్, రాణీ ముఖర్జీ తప్పకుండా వెళుతుంటారు. ఈ ఏడాది కూడా ఈ ఇద్దరూ అమ్మవారిని దర్శించుకున్నారు. కాజోల్ తన తనయుడు యుగ్‌తో కలిసి వెళ్లారు. ఇంకా హేమా మాలిని, ఆమె కుమార్తె ఈషా డియోల్ తన తల్లి దులారీ ఖేర్‌తో కలిసి అనుపమ్ ఖేర్ తదితరులు దుర్గా మాత ఆశీస్సులు అందుకున్నారు.

సరిపోదా శనివారం?



● నాని

'అంటే సుందరానికీ' చిత్రం తర్వాత హీరో నాని, దర్శకుడు వివేక్ ఆత్రేయ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. అలాగే ఈ నెల 23న ఓ అప్‌డేట్, 24న ఈ సినిమా ప్రారంభోత్సవం జరపనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి 'సరిపోదా శనివారం' అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం.

మేడమ్ అని కాకుండా సార్ అని పిలిచారు

- దర్శకురాలు పూజ



సంపూర్ణేష్ బాబు ప్రధాన పాత్రలో వీకే నరేశ్, శరణ్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. పూజా కొల్లూరు దర్శకత్వంలో వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో పూజా కొల్లూరు మాట్లాడుతూ– ''సైంటిస్ట్ లేదా ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకున్నప్పటికీ సినిమాతో సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని సినిమా రంగాన్ని కెరీర్‌గా ఎంచుకున్నాను. తెలుగులో 'మార్టిన్ లూథర్ కింగ్' నా తొలి సినిమా. కానీ ఈ చిత్రం కంటే ముందు కొన్ని హాలీవుడ్ ప్రాజెక్ట్స్‌తో అసోసియేషన్ ఉంది. కొన్ని డాక్యుమెంటరీలు తీశాను. ఇక 'మార్టిన్ లూథర్ కింగ్' విషయానికి వస్తే.. వై నాట్ స్టూడియోస్ సంస్థ తమిళ చిత్రం 'మండేలా' కథను తెలుగులో చెప్పాలనుకుని, వెంకటేశ్ మహాగారిని సంప్రదించారు. అయితే నిర్మాణంలో భాగమౌతానని, దర్శకత్వం వహించలేనని ఆయన చెప్పారు. దీంతో నేను దర్శకత్వం వహిస్తానని వెంకటేశ్ మహాగారికి చెప్పడంతో ఆయన వారికి చెప్పారు. ఓటర్లు వారి ఓటు హక్కును ఎందుకు వినియోగించుకోవాలన్నది ఈ సినిమా థీమ్. ఓ సామాన్యుడు నటిస్తే ఎలా ఉంటుందో అలా ఉండాలని సంపూర్ణేష్‌ని హీరోగా తీసుకోవడం జరిగింది. వెంకటేశ్ మహా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ ఇచ్చారు. నేను ఎడిటింగ్ కూడా చేశాను'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''ఏ భాషలోనైనా మహిళలకు అవకాశాలు తక్కువగానే ఉంటున్నాయి. నేను లేడీ డైరెక్టర్‌ని అయినా సెట్స్‌లో చాలాసార్లు ఓకే సార్ అన్నారు కానీ మేడమ్ అనలేదు. అంటే లింగ వివక్ష ఎంతలా నాటుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. సమస్య ఉన్నప్పటికీ మన పట్టుదలే మనల్ని ముందుకు నడిపిస్తుంది'' అని చెప్పుకొచ్చారు.

మంగళవారం కోసం ఎదురు చూస్తున్నా!

- హీరో కార్తికేయ



● నందిత, స్వాతి, అజయ్ భూపతి, కార్తికేయ, పాయల్, అజ్మల్, సురేష్ వర్మ

''ఆర్ఎక్స్ 100' తర్వాత నేను, అజయ్ భూపతి లేదా నేను, పాయల్ ఎప్పుడు మళ్లీ సినిమా చేస్తామని అందరూ అడుగుతుంటే.. మంచి కథ కుదరాలని చెబుతూ వచ్చాను. వారిద్దరి కాంబినేషన్‌లో 'మంగళవారం' సినిమా చేస్తున్నట్లు వార్తలు చూసి, నన్ను వదిలేసి ఇద్దరూ సినిమా చేశారు అనుకున్నా (నవ్వుతూ). అజయ్ తన సొంతూరు ఆత్రేయపురంలో 'ఆర్ఎక్స్ 100' తీశాడు. ఇప్పుడు ఆ ఊరిని మరో విధంగా 'మంగళవారం'లో చూపించాడు. 100 పర్సెంట్ అందరికంటే ఈ సినిమా కోసం నేనెక్కువ ఎదురు చూస్తున్నాను'' అని హీరో కార్తికేయ అన్నారు. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ ఆమిర్ జంటగా అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించిన ఈ సినిమా నవంబర్ 17న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో చిరంజీవి సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో హీరో కార్తికేయ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ''మంగళవారం' మంచి డార్క్ థ్రిల్లర్. ఇందులో మహిళలకు సంబంధించిన పాయింట్‌ని టచ్ చేశాం. కార్తికేయ, నా కాంబినేషన్‌లో మరో సినిమా ఉంటుంది'' అన్నారు. ''మా నాన్నకు (నిమ్మగడ్డ ప్రసాద్), నాకు సినిమాలంటే ఇష్టం. సినిమా నిర్మించాలనే నా కల 'మంగళవారం'తో నెరవేరింది'' అన్నారు స్వాతీ రెడ్డి. ''ఈ సినిమాతో నేను, స్వాతి నిర్మాతలుగా పరిచయమవడం గర్వంగా ఉంది'' అన్నారు సురేష్ వర్మ. ''నా కెరీర్ ఎటు వెళుతుందో తెలియని అనిశ్చితి ఉన్న సమయంలో 'మంగళవారం'కి చాన్స్ ఇచ్చారు అజయ్‌గారు'' అన్నారు పాయల్.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్



● పూజిత, విరాజ్

'బేబి' సినిమా ఫేమ్ విరాజ్ అశ్విన్ హీరోగా నటించిన చిత్రం 'జోరుగా హుషారుగా'. అను ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పూజిత పొన్నాడ కథానాయిక. నిరీష్ తిరువీధుల నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, దర్శకుడు కృష్ణ చైతన్య, పలువురు పాత్రికేయులు విడుదల చేశారు. అను ప్రసాద్ మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'జోరుగా హుషారుగా'. యువ తరానికి నచ్చే అంశాలతో అన్ని భావోద్వేగాలతో రూపొందించిన చిత్రం ఇది. కొత్తదనం ఆశించే ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది''అన్నారు.